ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 13 జనవరి 2024 | 5



16న జగ్గన్నతోట ప్రభల తీర్థం - 7
కేన్సర్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలకు చర్యలు
» జీజీహెచ్‌లో 19న 'నవ్య' డెస్క్ ప్రారంభం
» కేన్సర్ వైద్య సేవల కోసం ప్రత్యేక కృషి - 7

పండక్కి రావాలంటే.. కష్టమే!!

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారరీత్యా స్థిరపడిన వారు పండక్కి స్వస్థలాలకు రావాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ, రైళ్లల్లో రిజర్వేషన్లు అన్నీ ఫుల్ కాగా ప్రైవేటు బస్సుల్లోను అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. విమానాల్లోనూ చార్జీలు నాలుగైదు రెట్లు అధికంగా ఉన్నాయి. దీంతో పండక్కి రావాలంటే కష్టమే అంటున్నారు.

» ఇప్పటికే ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో సీట్లు ఫుల్
» ప్రైవేటు బస్సుల్లో ఐదారు రెట్లు అధికంగా చార్జీలు
» విమానాల్లోనూ అదే పరిస్థితి



పిఠాపురం/తుని రూరల్, జనవరి 12: జిల్లాలో సంక్రాంతి పండుగకు అత్యంత ప్రాధాన్యం ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉండే కుటుంబసభ్యులంతా ఒకేచోట చేరి ఆనందంగా పండుగను జరుపుకుంటారు. గ్రామాలు, పట్టణాల్లో ఆ సందడే వేరు. ఎక్కడ చూసినా పండుగ సమయాల్లో జరిగే సంబరాలు అంబరాన్నంటుతాయి. హైదరాబాదులో జిల్లానుంచి వెళ్లి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు అధికంగా ఉన్నారు. వీరు అక్కడినుంచి జిల్లాలోని కాకినాడ, పిఠాపురం, తుని, పెద్దాపురం, తుని, సామర్లకోట, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, గొల్లప్రోలు, కొత్తపల్లి, కరప. పెదపూడి, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగకు వస్తూ ఉంటారు. ప్రతిఒక్కరూ ఈ సమయంలో తమ స్వస్థలాలకు చేరుకునేందుకు ప్రాధాన్యమిస్తూ ఉంటారు. రైళ్లల్లో రిజర్వేషన్లు అందుబాటులోకి రాగానే నాలుగు నెలల క్రితమే రిజర్వేషన్లు చేయించుకున్నారు. రైల్వేశాఖ రోజుకొక స్పెషల్ రైలు ప్రకటిస్తున్నా అన్నింట్లోను రిజర్వేషన్లు ఫుల్ అవుతున్నాయి. ఆర్టీసీ సాధారణ, ప్రత్యేక బస్సుల్లో ఇప్పటికే సీట్లు ఫుల్ అయ్యాయి. దీంతో ప్రైవేటు బస్సుల్లో చార్జీలు ఆకాశాన్నంటుతున్నాయి. విమానాల్లో అదే పరిస్థితి ఉంది. చెన్నై, బెంగళూరు, పూణే తదితర ప్రాంతాలనుంచి వచ్చేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.

ప్రైవేటు బస్సుల్లో అధరహో..

హైదరాబాదు, పరిసర ప్రాంతాలనుంచి వచ్చే ఏపీఎస్ ఆర్టీసీ, తెలంగాణా ఆర్టీసీ బస్సుల్లో సీట్లు అన్నీ ఫుల్‌అయ్యాయి. సాధారణ సర్వీసులు కంటే రెండు రెట్లు అదనంగా బస్సులు నడుపుతున్నప్పటికీ ఎందులోనూ సీట్లు లేకపోవడం గమనార్హం.ఇదేఅదనుగా ప్రైవేటు బస్సు ల్లో చార్జీలను నాలుగైదు రెట్లు పెం చేశారు. సాధారణరోజుల్లో హైదరాబాదు నుంచి కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాలకు టిక్కెట్ రేటు రూ.900- 1200 మధ్య ఉండగా, స్లీపర్ టిక్కె ట్ ధర రూ.1,000 నుంచి రూ.1,400 వరకూ ఉండేది. ప్రస్తుతం 12, 13, 14వ తేదీల్లో ప్రయాణానికి సాధారణ టిక్కెట్ రేట్లు రూ.2,500-2,800 మధ్యఉండగా బుక్ చేసుకునే సమ యానికి రూ.4వేల వరకూ పడుతోంది. స్లీపర్ టికెట్ ధరలు ఇంత కంటే రూ.500 అదనంగా ఉంది. తిరుగు ప్రయాణాల సమయాల్లోనూ ఇదే స్థాయిలో రేట్లు ఉండడం గమనార్హం.

ప్రైవేట్ ట్రావెల్స్‌లో చార్జీలు మోత మోగడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 12నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ముగియడంతో అటు సెమిస్టర్ సెలవులు, పండుగ సెలవులు కలిసి వచ్చాయి. కంప్యూటర్ రంగంలో పని చేసేవారికి కూడా సెలవులు ఉండడంతో హైదరాబాద్, ముంబై, పూణె, చెన్నై తదితర ప్రాంతాలనుంచి జిల్లాలోని అన్ని పట్టణాలకు, గ్రామాలకు తరలిరావడం అనివార్యంగా మారింది. దీంతో ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. ఈ పరిణామం ప్రైవేట్ ట్రావెల్స్‌కు కాసులు కురిపిస్తున్నాయి.

రైళ్లల్లో ఖాళీ ఎక్కడ..?

హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లా మీదుగా పదుల సంఖ్యలో సాధారణ, ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. 12, 13, 14వ తేదీల్లో ఈ ఏ రైళ్లల్లో రిజర్వేషన్లు ఖాళీ లేవు. సాధారణ రైళ్లల్లో 50శాతంపైగా టిక్కెట్లను తత్కాల్ కేటగిరీకి కేటాయించడం, అందులో 40శాతం తత్కాల్ కేటగిరీ కింద ప్రత్యేకించారు. శుక్రవారం నాటి సాధారణ తరగతి తత్కాల్ రైలు టిక్కెట్ రూ.3వేలు ఉండగా, ఏసీ తరగతి ధర రూ.4,100-5,000 మధ్య ఉంది. ప్రత్యేక రైళ్లు ప్రకటించి రిజర్వేషన్ అవకాశం కల్పించిన



గంట వ్యవధిలోనే అన్ని ఫుల్ అవుతున్నాయి. సాధారణంగా కుటుంబసభ్యులతో కలిసి వచ్చేవారంతా రైళ్లల్లో ప్రయాణానికే అధిక ప్రాధాన్యమిస్తూ ఉంటారు. దీంతో వారు తత్కాల్, ప్రీమియం తత్కాల్‌లో టిక్కెట్లు బుక్ చేసుకుని ఇంటికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.



విమానాల్లో..

బస్సులు, రైళ్లల్లో టిక్కెట్లు ఫుల్ కావడంతో సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడిన వారు విమానాల్లో వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణరోజుల్లో శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాజమహేంద్రవరం వరకూ టిక్కెట్ ధర రూ.3,200-4,000 మధ్య ఉండగా గురువారం ఈ ధర రూ.16వేలుగా ఉంది. గంట గంటలకు టిక్కెట్ రేట్లు పెరిగిపోతున్నాయి.

సొంత వాహనాలనే నమ్ముకుని..

ఆర్టీసీ బస్సులు, రైళ్లు ఫుల్ కావడం, ప్రైవేటు బస్సులు, విమానాల్లో చార్జీలు భారీగా పెరగడంతో సొంత వాహనాలు ఉన్నవారు అందులోనే స్వస్థలాలకు వచ్చేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. బంధువులు, స్నేహితులు కలిపి తమ కార్లల్లో వస్తే స్థానికంగా తిరిగేందుకు పనికి వస్తుందని భావనలో ఉన్నారు. శనివారం సెలవు కావడంతో ఎక్కువమంది శుక్రవారమే స్వస్థలాలకు బయలుదేరుతున్నారు. దీంతో రోడ్డు మార్గాలు తెలంగాణా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుంచి వచ్చేవారితో బిజీగా మారనున్నాయి.

అధిష్ఠానంపై ధిక్కారమా?


పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

» పిఠాపురంలో బలప్రదర్శనకు దిగిన ఎమ్మెల్యే పెండెం
» పుట్టినరోజు వేడుకకు తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు, ప్రజలు
» వైసీపీ అధిష్ఠానానికి హెచ్చరిక పంపారా అంటూ చర్చ

పిఠాపురం, జనవరి 12: వైసీపీ అధిష్ఠానం టిక్కెట్ లేదని చెప్పడంతో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పుట్టిన రోజు వేడుకల సాక్షిగా బలప్రదర్శనకు దిగారు. పదిరోజుల క్రితం పిఠాపురం వైసీపీ సమన్వయకర్తగా కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్‌ను నియమించినట్లు పార్టీ అధినాయకత్వం ప్రకటించింది. దీనిపై దొరబాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ మారతారని జోరుగా ప్రచారం సాగింది. గీతతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నా తన బలాన్ని అధిష్ఠానానికి తెలియజేయాలనే భావనతో ఉన్న ఆయన అందుకు జన్మదిన వేడుకలను వేదికగా చేసుకున్నారు. శుక్రవారం దొరబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసేందుకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు భారీగా తరలివచ్చారు. వీరికి ఆయన ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. పెండెంకు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా సీఎం జగన్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పుట్టినరోజు వేడుకల్లో తన రాజకీయ భవిష్యత్తుపై ప్రకటన చేస్తారని, పార్టీ మార్పుపై ప్రకటన ఉంటుందని భావించినా ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. గీతను కోఆర్డినేటర్‌గా మాత్రమే ప్రకటించారని, టిక్కెట్ ఇంకా ఇవ్వలేదని దొరబాబు విలేకరులకు తెలిపారు. తనకు శుభాకాంక్షలు, సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు, కేడర్ తనను మరోమారు ఎమ్మెల్యేగా చూడాలని భావిస్తున్నారని చెప్పారు. పిఠాపురం టిక్కెట్ విషయంపై జగన్ పునరాలోచించాలని, తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల అభిప్రాయం మేరకే తన నిర్ణయం ఉంటుందని చెప్పడం కొసమెరుపు. దొరబాబు పుట్టినరోజు వేడుకలు సాక్షిగా అధిష్ఠానానికి అల్టిమేటం ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పరిణామాలు వైసీపీ వర్గాల్లో తీవ్ర కలవరం కలిగిస్తున్నాయి.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే తిరుగుబాటు

» 'ప్రజాదీవెన' పేరుతో పి.చామవరంలో సభ
» సభలో కనిపించని వైసీపీ జెండా
» టిక్కెట్ రాకపోయినా ప్రజలకోసం పనిచేస్తానని ప్రకటన

రౌతులపూడి, జనవరి 12: ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సీఎం జగన్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ప్రజాదీవెన పేరుతో సెంటిమెంటుగా శుక్రవారం రౌతులపూడి మండలం పి.చామవరం గ్రామంలో మొదటి సభ నిర్వహించారు. మండలంలోని మేరకచామవరం, శృంగవరం, బంగారయ్యపేట గ్రామాల్లో పర్యటించారు. తన బలం చూపించేందుకు కార్ల ర్యాలీతో పి.చామవరం సభకు చేరుకున్నారు. సభలో కానీ, కార్లకు కానీ ఎక్కడా వైసీపీ జెండాలు కనిపించలేదు. సభలో అక్కడికి వచ్చిన వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చివరి నిమిషంలోనైనా తనకు సీఎం జగన్ టిక్కెట్ ఇస్తారనే ఆశ ఉందన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా మీ ముందుకు వస్తానన్నారు. నాపై వైసీపీలో కొందరు పెద్దలతోపాటు జిల్లాకు చెందిన మరికొందరు పగబట్టారన్నారు. ఈ మధ్యకాలంలో జరుగుతున్న పరిణామాలకోసం పట్టించుకోవద్దన్నారు. ఇప్పటివరకూ చేసిన పదవుల గురించి వివరించారు. సమర్థత ఉన్నవాడికి టిక్కెట్ రాకపోతే ప్రత్తిపాడులో వైసీపీ ఓడిపోతుందని పరోక్షంగా వరుపులకు ఇన్‌చార్జి ఇవ్వడంపై జగన్‌ను హెచ్చరించారు. చివరి వరకు టికెట్‌కోసం ఎదురుచూస్తానని, రాకపోతే ఒంటరిగా పోరాటం చేస్తే మీ మద్దతు కావాలని కోరారు. టికెట్ రాకపోతే ప్రజలకోసం 24 గంటలు పనిచేస్తానని ప్రకటించారు తప్ప ఏ పార్టీలో ఉంటారన్నది స్పష్టంగా చెప్పలేదు. గతంలో ఎమ్మెల్యే సమావేశానికి వైసీపీ జెండాలు రెపరెపలాడగా పి.చామవరంలో ప్రజాదీవెన సభకు చిన్నపాటి ఫ్లెక్సీ తప్ప జెండాలు ఎక్కడా కన్పించలేదు. పి.చామవరం సభలో తప్ప మిగిలిన చోట్ల పెద్దగా జనం కనిపించలేదు.



పి.చామవరం ప్రజాదీవెన సభలో మాట్లాడుతున్న పర్వత ప్రసాద్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పడిపోయిన ర్యాంకులు

» కాకినాడకు జాతీయస్థాయిలో 178, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు
» గతేడాది జాతీయస్థాయిలో 101, రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 12: స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకులను జాతీయస్థాయిలో శనివారం ప్రకటించారు. స్వచ్ఛసర్వేక్షణ్‌స్థాయి స్వచ్ఛత నగరాల జాబితాలో కాకినాడ నగర పాలక సంస్థ జాతీయస్థాయిలో 178, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకులు లభించాయి. గతేడాది కంటే ఈ ఏడాది బాగా వెనకబడి ఉంది. గతేడాది 101 ర్యాంకు సాధించగా ఈ ఏడాది 178వ ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయిలో గతేడాది 6వ ర్యాంకు సాధించగా ఈ ఏడాది 10వ ర్యాంకుకు పడిపోయింది. సర్వేలెవెల్ ప్రోగ్రెస్‌కు 3వేల మార్కులు, సిటిజన్ వాయిస్ విభాగంలో 220 మార్కులు, ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, వాటర్ ప్లస్, చెత్త రహిత నగరాల జాబితాలో స్టార్ రేటింగ్ సర్టిఫికేషన్ మొత్తం 7500 మార్కులకు సర్వే నిర్వహించగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ సిటిజన్ వాయిస్ విభాగంలో 1684 పాయింట్లు వచ్చాయి. ఓడీఎఫ్ విభాగంలో గతంలో ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ సాధించగా ఈ ఏడాది ఓడీఎఫ్ మాత్రమే దక్కింది. దీంతో ర్యాంకు అనుకున్న స్థాయిలో రాలేదు.

పెద్దాపురానికి సౌత్‌జోన్‌లో 88, రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంకు

» గతేడాది సౌత్‌జోన్‌లో 159, రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు

పెద్దాపురం, జనవరి 12: కేంద్రం ప్రభుత్వం ప్రతిఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఈసారి పెద్దాపురం మున్సిపాలిటీకి 30వస్థానం దక్కింది. రాష్ట్రంలో 30వ ర్యాంక్, సౌత్ జోన్‌లో 88వ ర్యాంక్ లభించినట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. గతంలో 25వేలనుంచి 50వేల జనాభా ప్రాతిపదికను తీసుకోగా ఈసారి లక్షలోపు జనాభాను ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలిపారు. దానికి సంబంధించి ఈ విభాగంలో ఈ ర్యాంక్ లభించినట్లు తెలిపారు. స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు ఎంపిక కావడానికి సేవాస్థాయి పురోగతి, నాణ్యమైన చెత్తసేకరణ, ప్రత్యేక వాహనాల నిర్వహణ, పారిశుధ్య పనితీరు, రోడ్ల పరిశుభ్రత, ప్రజాసమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించడం, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర విభాగాల్లో మెరుగైన ఫలితాలు చూపడంలో నాణ్యమైన సేవలందించినందుకు ఈ ర్యాంకులు లభించినట్లు కమిషనర్ తెలిపారు. అవార్డు పొందడానికి కృషిచేసిన శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, ఇతర విభాగాలను ఆయన అభినందించారు. గతేడాది రాష్ట్రంలో 18వ స్థానం లభించగా, సౌత్‌జోన్‌లో 159వ ర్యాంక్ లభించింది. ఈసారి జాతీయస్థాయిలో 1652వ ర్యాంక్ వచ్చిందన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు


ప్రత్తిపాడులో అంగన్‌వాడీ సమ్మె 32వ రోజు అంకెను ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అనుమతులు.. ఎవరిని అడగాలి?


తుని మండలం ఎస్.సురవరంలో కోడి పందాలకు సిద్ధం చేసిన బరి

» కోడిపందాలకు బరులు సిద్ధం
» చిన్నబరులకు రూ.5.50 లక్షలు.. పెద్ద బరులకు రూ.30లక్షల వరకు పాట
» జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురంల్లో అటు ఎమ్మెల్యేలు.. ఇటు ఇన్‌చార్జులు
» మెట్టలో అనుమతులకు ఎవరిని సంప్రదించాలనే అయోమయం
» తలలు పట్టుకుంటున్న బరుల నిర్వాహకులు, అధికారులు

జగ్గంపేట, జనవరి 12: సంక్రాంతి పండుగ వచ్చేసినట్టే.. ఆదివారమే భోగి పండుగ. మూడు రోజుల పండగకు జూదర్లు కోడి పందాలకు సై అంటున్నారు. ఇందుకు ఎక్కడిక్కడ బరులు సిద్ధం చేసుకుంటున్నారు. అధికారులు అనుమతు లేవని హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా పందాలు వేస్తామంటున్నారు.

బరులకు లక్షల్లో పాట

ఈనెల 14, 15, 16 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వచ్చాయి. దీంతో మెట్టప్రాంతమైన జగ్గంపేట పరిసర ప్రాంతాలతోపాటు ప్రత్తిపాడు, పెద్దాపురం, తుని తదితర ప్రాంతాల్లో కోడిపందాలకు సర్వం సిద్ధమవుతున్నాయి. కోడిపందాలు, గుండాట ఆడేందుకు ఇప్పటికే సర్వం సిద్ధం చేస్తున్నారు. చిన్నబరులకు రూ.5.50 లక్షలనుంచి పెద్ద బరులకు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు ప్రస్తుతం పాట నడుస్తూ ఉంది. సంక్రాంతి సందర్భంగా ఎన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ మూడు రోజులు కోడిపందాలు, గుండాట, జూదాలు, పేకాట నిర్వహించేందుకు జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో అధిక మొత్తంలో సొమ్ములు చెల్లించుకుని బరులు సిద్ధం చేసుకుంటున్నారు.

ఎటు వెళ్లాలో తెలియక..

జిల్లాలో మెట్ట ప్రాంతంలోని జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లో ఓ సమస్య వచ్చి పడింది. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఇన్‌చార్జ్‌లకు పెత్తనం ఇవ్వడంతో జూదం ఆడడానికి అనుమతులకు ఎవరి దగ్గరకు వెళ్లాలో జూదరులకు, బరుల నిర్వాహకులకు అర్థం కావడంలేదు. అనుమతుల విషయంలో ఎవరి వైపు ఉండాలో అధికారులకు తెలియడంలేదు. స్థానిక ఎమ్మెల్యేలు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండడంతోపాటు అధికారికంగా వీరిని ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇన్‌చార్జ్‌ల హవానే కొనసాగుతూ వస్తోంది. దీంతో ఇన్‌చార్జ్‌లకు దగ్గరగా ఉన్న వ్యక్తుల ద్వారానే ఈ జూదాలు నిర్వహించేందుకు ఒకపక్క నిర్వహణ, నిర్వాహకులు వారి చుట్టూ తిరుగుతున్నారు. లేకపోతే గతంలో ఉన్న పరిచయాలతో ఎమ్మెల్యే అనుచరులతో లాభం చేస్తూ బరులు చక్రం చేసే పనిలో ఉన్నారు.

బరులు సిద్ధం

జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట, కాట్రావులపల్లి, గండేపల్లి, గోవిందపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాచపల్లి, ఒమ్మంగితోపాటు ఏలేశ్వరం, లింగంపర్తి గ్రామాల్లో పెద్దఎత్తున జూదాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. పోలీసులు ఒక పక్క బరులను పరిశీలించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరపకూడదని తెలుపుతున్నారు. పండుగ మూడు రోజులు కూడా పోలీస్, రెవెన్యూ, స్థానిక రాజకీయ నాయకులకు సొమ్ములు చెల్లించి దళారి వ్యవస్థ ద్వారా జూదాలు ఆడేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. మూడు రోజులే ఉండడంతో ఇన్‌చార్జ్‌లను పట్టుకుని చకచకా పనులు చేయించుకునే పనుల్లో ఉన్నారు.

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

తుని రూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పందెంకోళ్లు కాళ్లు దువ్వుతున్నాయి. గ్రామాల్లో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పందెం బరులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి వాహనాల రాకపోకలు, దుకాణాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. బరులవద్ద కోడిపందాలతోపాటు గుండాట ఏర్పాటు చేసి పెద్దఎత్తున వసూళ్లకు తెరతీసినట్లు సమాచారం.


జగ్గంపేటలో బరులు ఏర్పాటు చేయవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

కార్మిక చైతన్య బస్సు యాత్ర ప్రారంభం

» కార్మికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కార్యాచరణ చేపట్టేందుకు టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో యాత్ర



కార్మిక చైతన్య బస్సు యాత్రను ప్రారంభిస్తున్న యనమల, రాజప్ప

కాకినాడ సిటీ, జనవరి 12: నాలుగున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కార్మికులకు చేయూతనిచ్చి ఆదుకున్న ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని ఆ పార్టీ నేతలు అన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కార్యాచరణ చేపట్టేందుకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో టెక్కలినుంచి కుప్పం వరకు తలపెట్టిన కార్మిక చైతన్య బస్సుయాత్ర శుక్రవారం కాకినాడ నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్ సూపర్‌బజార్ సెంటర్‌వద్ద మాజీమంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. తొలుత కార్మిక పతాకావిష్కరణ చేసిన రఘురామరాజు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడారు. ఈ బస్సు యాత్ర ద్వారా కార్మికులకు టీడీపీ భరోసా కల్పించనుందన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్, ఆశావర్కర్లు తమ సమస్యలపై సమ్మె చేస్తున్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకుండా బెదింపులతో కేసులు బనాయిస్తోందన్నారు. తమ సమస్యల పరిష్కారం నిమిత్తం ఆందోళనలు చేస్తున్న వారందరికీ అండగా నిలవడమే ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పార్టీ నాయకులు గుత్తుల రమణ, తాతపూడి రామకృష్ణ, గుజ్జు లక్ష్మణరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొబ్బరి చెట్లు.. చేలగట్ల మధ్య.. ప్రకృతి ఒడిలో..

ఆధ్యాత్మిక జాతర!

- 16న జగ్గన్నతోట ప్రభల తీర్థం
- కోనసీమలో ఉత్సవాలకు ఏర్పాట్లు
- జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి ప్రముఖుల గుర్తింపు
- 2020లో ప్రధాని మోదీ.. శివకేశవ యూత్‌కి లేఖ
- 2021లో ఏకాదశ రుద్రులపై శృంగేరి పీఠాధిపతుల సందేశం
- 2023లో ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఏకాదశ రుద్రుల శకటం
- ఏకాదశ రుద్రుల దర్శనానికి పోటెత్తనున్న భక్తులు
- ఈ ఏడాది 3 లక్షల మంది వచ్చే అవకాశం



ఢిల్లీలో గత ఏడాది జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏకాదశరుద్రుల శకటం

అంబాజీపేట, జనవరి 12: భూమాత పరిచిన పచ్చని తివాచీల్లాంటి వరి చేలు.. ఆ తల్లి ప్రతిష్ఠించిన స్వాగతకేతనాల్లాంటి కొబ్బరి చెట్లు నడుమ.. నేలకు దిగి వచ్చిన ఇంద్రధనస్సులా సాగే కోనసీమ ప్రభల తీర్థం ఓ దృశ్య కావ్యం వంటిది. జీవన విధానంలో ఆధునికత ఎంత సంతరించుకుంటున్నా సంప్రదాయం చెక్కుచెదరట్లేదనడానికి నిదర్శనంగా నిలుస్తోంది ప్రభల తీర్థం. ఆధ్యాత్మికతకు అందాన్ని జోడిస్తూ కోనసీమలో జరిగే వన్నెల పర్వమే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ఈ ఏడాది దాదాపు మూడు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా. ప్రతిఏటా కనుమ రోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవం జరుగుతుంది. 2020 సంవత్సరంలో గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతను వివరిస్తూ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. దానికి స్పందించిన ఆయన ప్రతి లేఖ రాశారు. ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని ఆకాంక్షించారు. 2021లో శృంగేరీ పీఠాధిపతికి లేఖ రాయగా ఉత్తరాధికారి విధు శేఖర భారతీస్వామి ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యంపై సందేశం పంపించారు. 2023లో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పెరేడ్‌లో జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటంగా శకటంగా ప్రదర్శనలో పాల్గొంది. దీనిని వీక్షించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు పలువురు ప్రముఖులు తన్మయత్వం చెందారు. దీంతో ప్రపంచం నలమూలలకు ఏకాదశ రుద్రుల ఖ్యాతి విస్తరించింది. గతేడాది కార్తిక మాసంలో ఏకాదశ రుద్రుల దర్శనానికి గోదావరి జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సుమారు 120 గ్రామాల్లో ప్రభల తీర్థాలు ఘనంగా జరుగుతాయి. వీటిని కనులారా తిలకించేందుకు ఈ ప్రాంతాలకు చెంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డ ప్రముఖులు తప్పకుండా విచ్చేస్తారు. ప్రత్యేకంగా అలంకరించిన ఈశ్వరుని ప్రతిరూపంగా పిలిచే ప్రభలను గ్రామాల్లో ఊరేగిస్తే శాంతి సౌభాగ్యాలు చేకూరతాయనేది పూర్వీకుల ఉవాచ. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత పురోభివృద్ధి సాధించినా.. అధునాతన వాహనాలు అందుబాటులోకి వచ్చినా సంప్రదాయబద్ధంగా బండెనక బండి కట్టి రెండెడ్ల బళ్లపైనే ప్రజలు ప్రభల తీర్థాలకు రావడం అనవాయితీ. కొత్తపేట, జగ్గన్నతోట, మామిడికుదురు, అంబాజీపేట, బండారులంక, తొండవరం, చిరతపూడి, ముమ్మిడివరం, అయినవిల్లి, ఐ.పోలవరం, పోతవరంల్లో జరిగే ప్రభల తీర్థాలు ముఖ్యమైనవి.

జగ్గన్నతోట తీర్థానికి ప్రత్యేక విశిష్టత

సుమారు 450 ఏళ్ల కిందట నుంచి కనుమ పండుగ నాడు నిర్వహించే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక విశిష్టత ఉంది. మకర సంక్రమణం, ఉత్తరాయణ మహాపుణ్యకాలంలో అంబాజీపేట మండల మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే తీర్థం చారిత్రాత్మకమైనది, పవిత్రమైనది. ప్రాచీన కాలంలో తొలిసారిగా ఇక్కడ ప్రభల తీర్థం నిర్వహించారని భోగేశ్వరస్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి, గోపురం లేకుండానే ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహించడం ప్రత్యేకత. హిందూశాస్త్రం ప్రకారం ఏకాదశ రుద్రులు కొలువుదీరేది దేశం మొత్తం మీద జగ్గన్నతోట ఒక్కటే. 17వ శతాబ్దంలో కనుమ నాడు ఏకాదశ రుద్రులు లోక కల్యాణార్థం ఇక్కడ సమావేశమయ్యారని చారిత్రక కథనం. పెద్దాపురం సంస్థానాధీశులైన రాజా వత్సవాయి జగన్నాథ మహారాజు (జగ్గన్న) ఇక్కడకు విచ్చేసి ఏకాదశ రుద్రులను దర్శించుకుని ప్రభల తీర్థాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కృషిచేశారని.. అప్పట్నుంచీ ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తున్నారని చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోంది.

పచ్చని చేలను తొక్కుకుంటూ...

గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలను ఆయా గ్రామాల యువకులు పంటచేలను తొక్కుకుంటూ అప్పర్ కౌశికను దాటించే సుందర దృశ్యాలను చూసేందుకు వేలాది మంది పోటీపడతారు. అలాగే తొండవరం, వాకలగరువు ప్రభలు 42 అడుగుల ఎత్తులో ఉంటాయి. వీటిని గ్రామం నుంచి తీర్థానికి తీసుకొచ్చే సమయంలో మార్గమధ్యంలో విద్యుత్ లైన్లను తాత్కాలికంగా తొలగిస్తారు. ప్రభల తయారీలో యువకులదే ముఖ్య పాత్ర. తాటిపట్టితో తయారు చేసిన సూలం, మర్రి, టేకు కలపతో తయారుచేసిన బల్ల వెదురు, పోకగెడలతో ప్రభలను తయారుచేసి రంగు రంగుల వస్త్రాలు, నెమలి పింఛాలు, పువ్వులు, ధాన్యం కుచ్చులతో అందంగా తయారు చేసి ఉత్సాహంగా గ్రామాల్లో ఊరేగిస్తారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

జగ్గన్నతోటలో ఈనెల 16న జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి సుమారు 3 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ట్రాఫిక్, తాగునీరు, వైద్య సదుపాయం, బారికేడ్లు వంటి ఏర్పాట్లు కల్పిస్తున్నారు.

40 ఏళ్లుగా ప్రభ తయారు చేస్తున్నా..



గంగలకుర్రు అగ్రహారం శ్రీవీరేశ్వరస్వామి వారి ప్రభను యువకుల సాయంతో సుమారు 40 ఏళ్లుగా తయారు చేస్తున్నాను. ప్రభ తయారీకి చాలా అనుభవం, ప్రావీణ్యం కావాలి. ప్రభ పంటచేలు, కౌశిక నది దాటాల్సి ఉన్నందున అత్యంత పటిష్టంగా తయారుచేస్తున్నాం.

- శ్రీపాద వెంకటరమణ, జి.అగ్రహారం

పరమశివుడే మా చేలలో వెళ్లినట్టు..



గంగలకుర్రు అగ్రహారం శ్రీవీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి రుద్ర ప్రభలు మా పంట చేల మీదుగా వెళితే ఆ పరమశివుడే వెళ్లినట్టు భావిస్తాం. ఈవిధంగా ఊడ్చిన చేలను ఎంతో మంది భక్తులు తొక్కుకుంటూ వెళ్లినా బాగా పండుతాయి.

- పితాని సత్తిబాబు, రైతు, గంగలకుర్రు


పాశర్లపూడిలో పైపులైన్ నుంచి స్వల్పంగా లీకవుతున్న గ్యాస్

పాశర్లపూడిలో పైపులైన్ నుంచి గ్యాస్ లీక్

మామిడికుదురు, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో గెయిల్‌కు చెందిన పైపులైన్ నుంచి గ్యాస్ శుక్రవారం స్వల్పంగా లీకైంది. పాశర్లపూడి ఓఎన్జీసీ చమురు బావి నుంచి గ్యాస్ నగరం జీసీఎస్‌కు ఈ పైపులైను నుంచి సరఫరా అవుతోంది. నెల రోజుల కిందట ఈ పైపులైను లీకవడంతో అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు నిర్వహించి వదిలేశారని, మళ్లీ అక్కడే శుక్రవారం పైపులైను లీకైందని రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అయితే ఓఎన్జీసీ అధికారులు పైపులైన్‌ను పరిశీలించి వెళ్లారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి పైపులైనుకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు నిర్వహించాలని వారంతా కోరుతున్నారు.

మూడు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్టు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని బొలెరో వాహనంలో మాచవరం నుంచి బిక్కవోలు తరలిస్తుండగా రాయవరంలో పట్టుకున్నామన్నారు. డ్రైవర్ షేక్ బషీర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

కడుపునొప్పితో రైల్వే ప్రయాణికుడి మృతి

తుని రూరల్, జనవరి 12: కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో శాలిమార్ నుంచి చెన్నైకు వెళ్తుండగా బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ అల్మాగిరి హుస్సేన్ తీవ్ర కడుపునొప్పితో మృతి చెందాడు. దీన్ని గమనించిన ప్రయాణికులు తునికి చేరుకునేసరికి అత్యవసరంగా రైలు నిలుపుదల చేసి స్టేషన్‌లో గల రైల్వే డాక్టర్ పరిశీలించారు. అయితే అప్పటికే వ్యక్తి మృతి చెందడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తుని రూరల్, జనవరి 12: విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి తుని రైల్వే పోలీసులు పరిధిలో గుల్లుపాడు వద్ద గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకోగా వ్యక్తి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో సంబంధీకులు ఎవరైనా రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.


మృతి చెందిన వ్యక్తిని బయటకు తీస్తున్న దృశ్యం

అడవి పందులకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

- తోటి వేటగాళ్లు తప్పించుకునేందుకు

మృతి చెందిన వ్యక్తిని కాళ్లు కట్టేసి చెరువులో పడేసిన వైనం

జగ్గంపేట, జనవరి 12: వన్యప్రాణులను వేటాడడానికి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయాడు. జగ్గంపేట తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామ శివారులో కంపిరి సత్యనారాయణ జీడిమామిడి గార్డెన్‌లో ప్రత్తిపాడు గ్రామానికి చెరుకూరి అచ్చిబాబు, ఎర్రా ఈశ్వర్, మేకల కార్తీక్ గురువారం రాత్రి వన్యప్రాణులను వేటాడడానికి వెళ్లారు. అక్కడ కాపవరపు సురేష్, ఎర్రా విష్ణు, బోదిరెడ్డి సుబ్బారావులు వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటుచేశారు. వాటిని తాకడంతో కార్తీక్ (30) చనిపోయాడు. తర్వాత నిందితులు ముగ్గురూ కలిసి కార్తీక్ మృతదేహాన్ని గ్రామంలో ఉన్న చెరువులో పడేశారు. పోలీసులు శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీశారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని ఎస్ఐ నాగార్జునరాజు తెలిపారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో ఊరట

రంపచోడవరం, జనవరి12: అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎస్టీ కాదంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఆమె క్యాస్ట్ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ ఇటీవల జీవోనెం.2ను ప్రభుత్వం జారీచేసింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. 2016లో తన కులాన్ని ఎస్టీగా కలెక్టరు నిర్ధారించినట్లు ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణ అనంతరం ప్రభుత్వం ఇచ్చిన జీవోను కోర్టు సస్పెండ్ చేసింది.

రాష్ట్ర బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ఈనెల 14న జరిగే రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది సభ్యుల జట్టు పాల్గొననుందని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడకు చెందిన వీరబాబు కెప్టెన్‌గా వ్యవహరిస్తారని, టీమ్ మేనేజర్ కం కోచ్‌గా రాజు హాజరవుతారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గోకవరం, జనవరి 12 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన కొంజం అఖిల్ (28) అనే యువకుడు శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళుతున్న సమయంలో కృష్ణంపాలెం గ్రామ శివారులో బీఎస్ఆర్ కళాశాల సమీపంలో రంపచోడవరం వైపు వెళ్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల తలకు తీవ్రమైన గాయాలుకాగా స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 నుంచి కులగణనకు శ్రీకారం : మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి12(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఈనెల 19న ఆవిష్కరించనున్న సందర్భంగా కులగణనకు శ్రీకారం చుట్టనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు.. పక్కన టీడీపీ, జనసేన నేతలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బహిరంగ చర్చకు టీడీపీ సిద్ధం
- రూ.13 లక్షల కోట్ల అప్పుపై ఖర్చులు చెప్పాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

మండపేట, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం అప్పులపై చేసిన వ్యాఖ్యలకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై చర్చించేందుకు మంత్రి బుగ్గన సిద్ధమా అంటూ చాలెంజ్ విసిరారు. సీఎం జగన్ తన సొంత బడ్జెట్‌ను అమలుచేస్తున్నాడని యనమల ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఆర్థిక లెక్కలపై అవగాహన లేదన్నారు. ఈ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రతి వ్యక్తిపై రూ.2.5 లక్షలు రుణ భారం పడిందన్నారు. ఈ ప్రభుత్వంలో చేస్తున్న ఖర్చులకు లెక్కాపత్రం లేకుండా పోయిందని యనమల ఆరోపించారు. ప్రభుత్వం చేసిన అప్పులు రూ.13 లక్షలు కోట్లు మేర ఉన్నాయని.. రాబోయే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏవిధంగా అప్పులు తీర్చి ప్రజలపై భారం పడకూడదనే అంశంపై టీడీపీ, జనసేన నేతలు చర్చిస్తున్నారని యనమల అన్నారు. ప్రభుత్వంలో సీఎం జగన్ 48 నెలల పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. యువతకు ఉపాధి లేకపోవడం, అప్పుల కారణంగా రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని యనమల ఆరోపించారు. వీటన్నింటికి అధిగమించి రేపు రాబోయే రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడం, ఉపాధి పొందేలా ఆర్థిక సహాయం అందించడం వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.లక్ష కోట్ల మేర అప్పులు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఖర్చులు, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని యనమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మండపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, పార్లమెంట్ ఇన్‌చార్జిలు హరీష్ మాధుర్ బాలయోగి, జ్యోతులు నవీన్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల బుచ్చిబాబు, అయితాబత్తులు ఆనందరావు, వనమాడి కొండబాబు, చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, వీవీవీ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, రెడ్డి ప్రసాద్, జనసేన నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, పితాని బాలకృష్ణ, శెట్టిబత్తులు రాజబాబు పాల్గొన్నారు.


కీమోథెరపీ వార్డుని పరిశీలిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కేన్సర్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలకు చర్యలు

- జీజీహెచ్‌లో 19న 'నవ్య' డెస్క్ ప్రారంభం
- కేన్సర్ వైద్య సేవల కోసం ప్రత్యేక కృషి

జీజీహెచ్(కాకినాడ), జనవరి12: కాకినాడ జీజీహెచ్‌లో కేన్సర్ రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందించేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో కేన్సర్ రోగులకోసం ప్రత్యేక వార్డు ఉంది. ఇక్కడ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ నేతృత్వంలో నిష్ణాతులైన వైద్యనిపుణులు రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. కేన్సర్‌తో బాధపడేవారికి రేడియేషన్, కీమోథెరపీ అందిస్తున్నారు. రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు టాటా మెమోరియల్ కాన్సర్ ఆస్పత్రి భాగస్వామ్యంతో 'నవ్య' ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కేన్సర్‌వార్డులోనే నవ్య డెస్క్ ఏర్పాటు చేస్తారు. రోగుల సమగ్ర సమాచారం సేకరించి ఇందులో సమాచారం పొందుపరుస్తారు. రోగుల అనారోగ్య రుగ్మతలను నవ్య ద్వారా కేంద్ర, రాష్ట్రాలు, టాటా మెమోరియల్ ఆసుపత్రిలో ఉన్న నిష్ణాతులైన వైద్యుల సలహాలు, సంప్రదింపులు జరిపి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నవ్యను ఈనెల 19న ప్రారంభించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం కేన్సర్ విభాగంలో పర్యటించి రోగుల వివరాలు, రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు, మందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నవ్య ప్రారంభోత్సవానికి టాటా మెమోరియల్ కాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహాన్‌శెట్టి, డీఎంఈ డాక్టర్ నరసింహంతో సహా పలువురు ప్రముఖ వైద్యులు విచ్చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ట్రాన్స్‌జెండర్లకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు వీలుగా ప్రస్తుతం జీజీహెచ్‌లో ఉన్న టీజీ హెల్ప్‌డెస్క్‌కు అదనంగా 14వ నెంబర్ వార్డు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రదీప్, నరసింహులు పాల్గొన్నారు.

23 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

ప్రత్తిపాడు, జనవరి 12: కాకినాడ జిల్లా ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో 23 మద్యం సీసాలతో ఇద్దరి వ్యక్తులను ప్రత్తిపాడు సెబ్ అధికారులు అరెస్టు చేశారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో ముద్దాడ నాగేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద 10 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నారు. శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో బత్తుల ఏసుబాబును మరో 13 మద్యం సీసాలతో అరెస్టు చేశారు. ఏలేశ్వరం గ్రామంలో 20లీటర్ల సారాతో జి.గంగలను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జున, రాజు, దొరబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.


హైస్కూళ్లకు మెటీరియల్స్ అందిస్తున్న పెన్మెత్స నరసింహరాజు

రూ.5 లక్షలతో స్కూళ్లకు మెటీరియల్ అందజేత

అంతర్వేది, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో ఉన్న 15 హైస్కూళ్లకు ఎంఈవో కార్యాలయంలో దాత పెన్మెత్స నరసింహరాజు రూ.5.06 లక్షల విలువైన మెటీరియల్‌ను అందించారు. ఎలక్సర్ మెట్‌ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)కు సంబంధించి దివంగత నేత మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు అల్లుడు నరసింహరాజు పాఠశాలలకు ఇన్వెర్టర్లు, సౌండ్‌సిస్టమ్, సీసీ కెమెరాలు, ప్రింటర్లు బహూకరించినట్టు ఎంఈవోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు డి.కిశోర్, ఎం.వెంకటేశ్వరరావు, గెజిటెడ్ హెచ్‌ఎంలు ఎన్.సత్యనారాయణ, కోలా వీరాస్వామి, కనకలింగేశ్వరరావు, జగదీప్, శ్రీనివాస్, సత్యనారాయణ, సుజాత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దాతకు చిత్రం పటం అందజేస్తున్న దృశ్యం

అన్నదాన ట్రస్టుకు రూ.2.21లక్షల విరాళం

ఐ.పోలవరం, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు భీమవరం నివాసి ఇందుకూరి రామకోటేశ్వరరాజు రూ.2,21,200 విరాళం సమర్పించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత దాతకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందించి సత్కరించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, జనవరి 12: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనం తరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమ గుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కోడిపందేలు, గుండాట ఆడితే కఠిన చర్యలు

హెచ్చరించిన పోలీసులు, అధికారులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదాలు, గుండాట నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో గతంలో కోడిపందేలు నిర్వహించిన ప్రదేశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే గతంలో బరులు నిర్వహించిన వారిని గుర్తించి బైండోవర్ చేశామని తెలిపారు. సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, పండుగను కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. అంతకు ముందు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జాయింట్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్ఐ బాలాజీ తదితరులున్నారు.

కాకినాడ సిటీ: సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు ఆడకుండా, సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఎడ్ల పందాలు వంటివితో పండుగలు జరుపుకోనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అన్నారు. కోడి పందేల నియంత్రణ, బరుల ధ్వంసంపై సమన్వయంతో చేపట్టాల్సిన కార్యచరణలో భాగంగా శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ కె.ప్రమోద్, కార్యాలయ పరిపాలనాధికారి వరహాలయ్య పాల్గొన్నారు.

సామర్లకోట: మండలంలోని పండ్రవాడ, అచ్చంపేట, వీకె.రాయపురం, వేట్లపాలెం గ్రామాల్లో కోడిపందేలకు ఏర్పాటుచేసిన బరులను సామర్లకోట పోలీసులు ధ్వంసం చేసారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌వో సురేష్ తదితర పోలీసులు పాల్గొన్నారు. సామర్లకోట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.కుమారి వీఆర్వోలతో కలిసి కోడిందేల నిరోధించేందుకు పోలీసు, రెవెన్యూ శాఖలు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

తుని రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని సంప్రదాయ క్రీడలు ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు సీఐ సన్యాసిరావు తెలిపారు. కోడిపందేలు, గుండాల వంటి జూదాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని తెలిపారు. తహశీల్దార్ ఎన్.శివకుమార్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించారు.

కిర్లంపూడి: గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కిర్లంపూడి ఎస్ఐ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. తహశీల్దార్ మాధవరావు, ఎంపీడీవో రాజేశ్వరరావుతో కలిసి గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించే బరులు నిర్వహించే స్థలాల వద్దకు వెళ్లి ఆయా యాజమాన్యాలను బరులకు ఇవ్వరాదన్నారు.

పెదపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, జూదం, గుండాట అశ్లీల నృత్యాలు వంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పెదపూడి ఎస్ఐ వీ.శోభన్ కుమార్ అన్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కొత్తపల్లి: సంప్రదాయ క్రీడల ముసుగులో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ పీవీసీ స్వామి నాయుడు హెచ్చరించారు. మండల గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహించరాదని బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.శేఖర్‌బాబు చెప్పారు. ప్రత్తిపాడులో మాట్లాడుతూ కోడిపందాలు, గుండాల,పేకాటకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

గండేపల్లి: గండేపల్లి ఎస్ఐ ఎం.పవన్‌కృష్ణ, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకట్రామన్ కోడిపందేలు జరిగే ప్రదేశాలను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సంప్రదాయ క్రీడలతో సంబరాలు జరుపుకోవాలని వారు ప్రజలను కోరారు.

'హామీల ఆదేశాలను తక్షణం జారీ చేయాలి'

కాకినాడ సిటీ, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం చర్చల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీల ఆదేశాలను తక్షణం జారీ చేయాలని జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను వివరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విజయవంతానికి సహకరించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు, పోలీస్ డిపార్ట్‌మెంటుకు, సీఐటీయూ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీ సాయికిరణ్, ఎ.లోవరాజు, వీవీవీ మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, సహాయకార్యదర్శులు కె.చంద్రశేఖర్, జి.నారాయణ, ఎంటీ సాల్మన్, జిల్లా కోశాధికారి పి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

'రైతు సమస్యల పరిష్కారానికి కృషి'

పెద్దాపురం, జనవరి 12: రైతులు పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి వ్యవసాయ సలహామండలి సభ్యులు కృషి చేయాలని ఏడీఏ నల్లి దైవకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయసలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందే సేవలను రైతులకు తెలియజేయాలన్నారు. ఏవో సంజయ్‌కుమార్, పశుసంవర్థకశాఖ వైద్యుడు డాక్టర్ రాకేష్, వీహెచ్ఏ చిలకమ్మ, ఎనీవీవీ ప్రసాద్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు ఇనకొండ వీరవిష్ణుచక్రం పాల్గొన్నారు.

వాకలపూడిలో 605 లీటర్ల సారా స్వాధీనం

సర్పవరం జంక్షన్, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా వాకలపూడిలో నాటుసారా విక్రయాలకు అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 605 లీటర్ల నాటుసారాను ఎస్ఈబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ సూపరింటెండెంట్ సీఐ, టీడీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం వాకలపూడి శ్రీనివాస్‌నగర్‌లో దాడులు నిర్వహించారు. ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 605 లీటర్ల నాటుసారాను గుర్తించి, నిందితుడు కలిదిండి రామచంద్రరావును అరెస్ట్ చేశారు. నిందితుడు సమాచారం మేరకు సారా సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులు, చిల్లరగా అమ్మేందుకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులతో కలపి మొత్తం 5గురు నిందితులను కేసు నమోదు చేసినట్టు కాకినాడ నార్త్ సెబ్ స్టేషన్ సీఐ కె.రామమోహనరావు తెలిపారు. భారీగా సారా పట్టుకున్న ఎస్ఈబీ అసిస్టెంట్ సీహెచ్.అజయ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ జె.విజయ్‌కుమార్, సిబ్బంది ఈ.ప్రసాద్, కె.నవీన, జి.వెంకటరమణను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

న్యాయవాదుల ఆందోళనలు

ప్రత్తిపాడు, జనవరి 12: ప్రజల ఆస్తులపై సమస్యలు సృష్టించే ఏపీ భూ హక్కుల చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐలాజ్, ఐయార్ల, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం, రాస్తారోకో, ఆందోళన నిర్వహించారు. నాయకత్వం వహించిన ఐలాజ్ నేత బుగతా శివ మాట్లాడుతూ ఈ చట్టాన్ని అమలు చేస్తే ప్రజలు తమ ఆస్తులపై హక్కులో కోల్పోతారన్నారు. న్యాయవాదులు ఆదారి సుగుణ, రాజాల చిట్టిబాబు, ఆకుల హరిబాబు, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, చిలపర్తి శ్రీనివాస్, ఐయార్ల జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, కిసాన్ సంఘ నాయకులు తాడి నాగేశ్వరరావు, జిక్కల అప్పారావు, తూము చినబాబు, తాడిలక్ష్మణరావు పాల్గొన్నారు.

పిఠాపురం: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు కోరుతూ పిఠాపురంలోని కోర్టుల వద్ద న్యాయవాదులు చేస్తున్న నిరాహారదీక్షలకు బీఎస్పీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఖండవిల్లి లోవరాజు, నాయకులు మద్దతు తెలిపారు. న్యాయవాదులు కొంగు నూకరాజు, అల్లం నాగేశ్వరరావు, గుదిమెళ్ల భాస్కరాచార్యులు, ఎం.సత్యవతి ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె దీక్ష సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 12: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె దీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు పిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల డిమాండ్ల కొంత వరకు పరిష్కారం అయ్యాయని ప్రభుత్వ హామీలను అమలు చేయకపోతే సమ్మె చేపడతామన్నారు. కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, బొబ్బిలి సత్యనారాయణ, యల్లారావు పాల్గొన్నారు.

కరపలో క్రికెట్ టోర్నమెంట్

కరప, జనవరి 12: కరప జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను కరప జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ ప్రారంభించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవు మధువీరేష్ మాట్లాడుతూ పోటీలు ఆరురోజులు పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పారావు, వైద్యులు బొండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవి మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ 1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ 2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరు కారం
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	గుంటూరు కారం
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	గుంటూరు కారం

విశేష పూజలు

సామర్లకోట, జనవరి 12: పట్టణంలో మఠంసెంటర్ వద్ద శ్రీవీర భద్రశ్రీరామాలయంలో ధనుర్మాస పర్వదినాల సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు యార్లగడ్డ నాగేశ్వరరావు, యార్లగడ్డ బాపినీడు ఆధ్వర్యంలో జరిగిన పూజలు అనంతరం 108 పాత్రల్లో ప్రసాదాలను నైవేద్యాలుగా దేవతామూర్తులకు నివేదించారు. మాండవ్యనారాయణ స్వామి పారాయణ మహిళా బృందంతో తిరుప్పావై పారాయణ చేశారు. అనంతరం పూజలకు పూర్ణాహుతి పలికారు. ప్రసాద వితరణ జరిగింది.

వివేకానందుని స్ఫూర్తి అనుసరణీయం

సెట్రాజ్ సీఈవో సత్యవతి

ఘనంగా వివేకానంద జయంతి



సర్పవరం జంక్షన్: వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఈవో సత్యవతి



పిఠాపురంలో వివేకానంద చిత్రపటానికి నివాళి

సర్పవరం జంక్షన్, జనవరి 12: దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి ఉత్తేజం నింపేందుకు స్వామి వివేకానందుని స్ఫూర్తి అనుసరణీయమని సెట్రాజ్ సీఈవో జె.సత్యవతి అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం రమణయ్యపేట జాతీయ యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) కార్యాలయంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివేకానంద జన్మదినాన్ని జాతీయ యువ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.

పిఠాపురం: స్వామి వివేకానంద ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సహృదయ మిత్రమండలి ప్రతినిధులు సూచించారు. వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభ్యుదయ రచయిత గౌరవ్ రచించిన మరుగున పడ్డ మహాయోధులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాంఘిక సంక్షేమశాఖ విశ్రాంత డీడీ అప్పారావు, సహృదయ మిత్రమండలి అధ్యక్షు డు తోట శ్రీనివాసరావు, చక్రధర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వెన్నపు చక్రధరరావు, వికాస డైరెక్టరు లక్ష్మణరావు, ప్రత్యూష. పి.పావని, సీ.సతీష్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, పోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాజులూరు: గొల్లపాలెం పీఎంపీ భవన్‌లో ఇంపేక్ట్‌క్లబ్ ఇంటర్నేషనల్ కోకొనడ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీకాకతీయ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వాములయ్యారు. బీసీ సంక్షేమశాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సనపల ధనరాజు, పెన్షనర్స్‌హోమ్ అధ్యక్షుడు దేవు సదానందమూర్తి ప్రసంగించారు. వివేకానంద చిత్రపటానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో బంగారు పతకం సాధించిన డీ.వీరపవన్‌ను సన్మానించారు. ర్యాలీ నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి జీ.నాగేంద్ర కుమార్, కోశాధికారి డీ.రమేష్‌కుమార్, శ్రీకాకతీయ కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.రాంబాబు, ప్రిన్సిపాల్ శివ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు జే.సూర్యనారాయణ, బీ.రాజు, ఆలీ,శ్రీనివాస్ తదితరులున్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని స్వామి వివేకానంద జ్ఞానమందిరంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు నాయకుడు సిద్దా అయ్యన్న, జ్ఞానమందిరం వ్యవస్థాపకుడు పడాల కన్నారావు, విశ్రాంత ఎంఈవో దుర్గాప్రసాద్, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, స్టాండ్ ఫర్ ది సొసైటీ అధ్యక్షుడు మొగలి దత్తు, దాడి పద్మనాభం, చల్లా ఉమారాజమంగతాయారు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: దుర్గాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహానికి సాయిప్రియ సేవా సమితి ఛైర్మన్ జ్యోతుల గంగాభవానీ శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దంగేటి నాగేశ్వరరావు, సాదనాల చంటిరాము, రావుల తాతారావు, పేకేటి వీరమణి, గౌతు పద్మ ఉన్నారు.

కిర్లంపూడి: వేలంక గ్రామంలో క్రీడా పోటీలను సర్పంచ్ రాయుడు బాబురావు, మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు నిర్వహించారు. సెక్రటరీ వీర్రాజు, అడబాల శ్రీను, బేతాళ మహేష్,ఎంపీటీసీ పాల్గొన్నారు.

కరప: వేళంగి మెర్లాస్ జడ్పీ ఉన్నత పాఠశాలలోని స్వామి వివేకానందుని విగ్రహానికి వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య గ్రామ సచివాలయం, పీహెచ్‌పీ సిబ్బంది, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఈ.సింధూర, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు, పాల్గొన్నారు. కరప నక్కా సూర్యనారాయణ మూర్తి, జడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానందుని విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో పార్కు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుంకర సత్యనారాయణ, కర్రి చంద్ర రావు, రాపేటి రాజజబాబు, శెట్టి సూరిబాబు, శెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు. ప్రత్తిపాడు నరేంద్రగిరికొండపై స్వామి వివేకానంద విగ్రహం వద్ద పలువురు పూలమాలలవేసి నివాళులర్పించారు.

తుని రూరల్: తుని పట్టణం, మండలంలో తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం తదితర గ్రామాల్లో పలువురు వివేకానంద జయంతిని నిర్వహించారు.

అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు



పెద్దాపురం ఆందోళనలో మాజీ మంత్రి పళ్లంరాజు

పెద్దాపురం, జనవరి 12: అంగన్‌వాడీ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా ముందుకు సాగుతున్నట్టు కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు ఆరోపించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో 32 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శిబిరానికి ఆయన శుక్రవారం చేరుకుని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వ నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ఐద్వా జాతా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కొత్తిం చంటిబాబు, సత్తిరాజు, సీఐటీయూ నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, సూరిబాబు, నాగ మణి తదితరులున్నారు.

గొల్లప్రోలు: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పరిష్కరించకపోగా ఎస్మా ప్రయోగించి బెదిరించడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సీఐటీయూ నాయకుడు దుంపల ప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.సత్యవతి, వి.వెంకటలక్ష్మి, ఎం.సూర్యకాంతం పాల్గొన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవులో అంగన్‌వాడీల సమ్మెకు టీఎన్‌టీయూసీ బృందం మద్దతును తెలిపింది. ప్రజానాట్యమండలి బృందం అంగన్‌వాడీల సమస్యలు, డిమాండ్లపై పాటలను పాడి చైతన్యపరచారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు సంఘీబావం తెలిపారు.

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్తిపాడులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై 32వ అంకె ఆకారంలో బైఠాయించి రహదారిపై ఆందోళన చేశారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి

పెదపూడి, జనవరి 12: అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జీ.మామిడాడలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అవినీతే లక్ష్యంగా నియోజకవర్గంలో పాలన సాగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. జీ.మామిడాడలో వస్తున్న ఆదరణతో టీడీపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు జుత్తుక సూర్యకుమారి, బండి సత్యవతి, టీడీపీ నాయకులు జుత్తుక కృష్ణ, పుట్టా గంగాధర చౌదరి, పైణ్ణి బాబు, సానా శ్రీను, తమలంపూడి శివరామారెడ్డి, ద్వారంపూడి గోపీకృష్ణారెడ్డి, మల్లిడి గణేష్‌రెడ్డి, గంటా రాజు, మెర్ల ప్రభాకర చౌదరి టీడీపీ నాయకులు ఉన్నారు.

రాష్ట్రంలో మాదిగలకు అన్యాయం

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బ్రహ్మయ్య

పిఠాపురం, జనవరి 12: రాష్ట్రంలో రాజకీయంగా మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి సమాన వాటా పంపిణీ చేయాని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. పిఠాపురం మున్సిపల్ కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు వచ్చిన రిజర్వేషన్లను అన్ని వర్గాలకు సమానంగా పంచాలన్నారు. రాజకీయ పార్టీలన్నీ ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని, మాదిగలకు న్యాయం చేయాలని కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కొమ్ము చినబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేమగిరి నాగసత్యనారాయణ, పట్టణ కన్వీనర్ కుందేటి జయరాజు, మోర్త అవినాష్, పెదపాటి సత్యనారాయణ, సుభాషిణీ, వల్లూరి నాని, నందిక చక్రం, వేమగిరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

తునిలో చంద్రబాబు సభ ఘన విజయం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



జగ్గంపేటలో మాట్లాడుతున్న నెహ్రూ

జగ్గంపేట, జనవరి 12: తునిలో జరిగిన రా కదలిరా చంద్రబాబు బహిరంగ సభ ఘన విజయవంతమైందని.. జగన్ విధ్వంసకర పాలన, వైసీపీ వైఫల్యాలపై మాట్లాడి అశేష జనవాహినిలో చంద్రబాబు జోష్ నింపారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఇర్రిపాక శివాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్ష మందికి పైగా హాజరైన జన సందోహాన్ని ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారన్నారు. సీఎం జగన్‌కు అభివృద్ధి చేయడం చేతకాదని రద్దులు, కూల్చివేతలు, దాడులు, కేసులు పెట్టడం, దోచుకోవడం, దాచుకోవడం తెలుసని విమర్శించారు. తుని సభ ద్వారా కాకినాడ జిల్లాలో టీడీపీ జనసేన క్యాడర్‌లో నూతన ఉత్సాహం వచ్చిందని.. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త కొండబాబు, తోట సర్వారాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చినబాబు, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు మండపా అప్పన్నదొర, రాయి సాయి, అడబాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కిర్లపూడి: సోమరాయనపేటలో టీడీపీ గ్రామ నాయకుడు పెనగంటి బాబ్జి ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ కనిశెట్టి వీరబాబు, వార్డు సభ్యులు బొడ్డేటి రమణ, రాపేటి హరికృష్ణ, కాళ్ళ సత్య లోకేశరావు, రాపేటి సుబ్బారావు, మళ్ళ హరికృష్ణ, కాళ్ళకామరాజు, కొండపల్లి అప్పన్నదొర 119 మంది వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పోరంశెట్టి మురళీకృష్ణ, నీలంశ్రీను, అనుకుల శ్రీకాంత్, పైలా మహేశ్వరరావు, బుద్దా రామచంద్రరావు పాల్గొన్నారు.

సాగునీరందక ఎండిపోతున్న పంటలు

మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం



బి.ప్రత్తిపాడులో రైతులతో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం రూరల్, జనవరి 12: రెండవ పంటకు పుష్కలంగా సాగునీరందిస్తామని చెప్పి రైతులను నమ్మించి తీరా వరిపంట వేసిన తర్వాత నీరు ఇవ్వకపోవడంతో ఎండిపోతున్నాయని, అయినా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టడం లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించిరైతులతో మాట్లాడారు. కొత్తకాలువ కింద బి.ప్రత్తిపాడు పరిధిలో 700 ఎకరాల్లో ఊడ్చిన వరి పంట సాగునీరందక ఎండిపోతున్నదని తెలిపారు. గొల్లప్రోలుతో పాటు పిఠాపురం నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి ఉందని, పంటలు ఎండిపోతున్నా సాగునీరందించేలా చూడాలనే ఆలోచన అధికార పార్టీ నేతలకు లేకపోవడం దుర్మార్గమన్నారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారని, పంట ఎండిపోవడం వల్ల జరిగిన నష్టానికి ఎవ్వరు బాధ్యులని ప్రశ్నించారు. ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడితే సాగునీరందేలా చూస్తామని చెబుతున్నారని, అయితే వచ్చే పరిస్థితి కనబటటం లేదన్నారు. గొల్లప్రోలు ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితిపై 3రోజుల క్రితం అధికారులకు చెప్పినా ఫలితం లేదని తెలిపారు. రైతులకు ఇంత కష్టం వచ్చినా ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టకపోవడం విచారకరమని తక్షణం సాగునీరు అందించి రైతుల పంటలు కాపాడాలని కోరారు. బొజ్జా సూరిబాబు తదితర నాయకులు ఉన్నారు.

ఉపాధి పనుల నిర్వహణపై బహిరంగ సమీక్ష

కరప, జనవరి 12: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించి జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై బహిరంగ సమీక్ష జరిపారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ పి. వసంత మాధవి, డీఆర్‌డీఏ డీపీఎం అశోక్‌భరత్, విజిలెన్స్ అధికారి రవిశంకర్, హెచ్ఆర్ మేనేజర్ గుత్తుల రాజేష్ బహిరంగ సమీక్ష జరిపారు. ఉపాధి పథకం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.17వేలే అపరాధ రుసుం విధించాలని, రూ.4,96,429 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఎస్ఆర్పీ చిరంజీవి అప్పారావు మండలంలో జరిగిన సామాజిక తనిఖీపై నివేదిక ఇచ్చారు. మండలంలోని 23 గ్రామాల పరిధిలో ఉపాధి పథకం, పంచాయతీ రాజ్, సర్వశిక్షాభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ10,19,09,578లు విలువ చేసే 1254 పనులు చేశారు. ఎంపీపీ పెంకు శ్రీలక్ష్మి, జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీడీవో అప్పారావు, ఏపీవో వెంకటరమణ, ఏఈఈ శైలజ ఉన్నారు.

సంక్రాంతి సంబరాలు

గండేపల్లి, జనవరి 12: సూరంపాలెంలో ఆదిత్య విద్యా ప్రాంగణంలో శుక్రవారం ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలకు చెందిన సాంస్కృతికవిభాగంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, మేడపాటి భాస్కర చంద్రారెడ్డి, డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, రవిశంకర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు

సర్పవరం జంక్షన్: వాకలపూడి ఫిషర్‌మెన్ కాలనీ, బొందగుంటలో మహిళలకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మిక్సీ గ్రైండర్, గ్యాస్ స్టవ్, నాన్‌స్టిక్ పేన్‌లను జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు కరెడ్ల గోవింద, రాష్ట్ర సహాయ కార్యదర్శి తాటికాయల వీరబాబు తదితరులున్నారు.

తుని రూరల్: తునిలో ముందస్తు సంక్రాంతి సంబరాలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి, పట్టణ ప్రముఖులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భోగిమంటలు, ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులందజేశారు.

కోడిపందేల ఏర్పాట్ల తొలగింపు

కాకినాడరూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో కోడిపందేల నిర్వహణకు కాకినాడ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో 2 రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. రూరల్ మండలం చీడిగలో ఏర్పాటు చేసిన వాటిని శుక్రవారం సాయంత్రం ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐల ఆధ్వర్యంలో ఏర్పాట్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ఆటో ద్వారా హెచ్చరికలు

సర్పవరం జంక్షన్: సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తారన్న సమాచారంతో ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ ఆటో ద్వారా హెచ్చరికలు చేశారు. కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డైయిరీఫారమ్ దుర్గాసెంటర్, సర్పవరం పాత ట్రస్ట్ ఆసుపత్రి సమీపంలో వేసిన టెంట్‌లను తొలగించినట్టు సీఐ తెలిపారు.

'అహంకార ప్రభుత్వం పోవాలి'



తాళ్లరేవులో మాట్లాడుతున్న రఘురామరాజు

తాళ్లరేవు, జనవరి 12: రాష్ట్రంలో అహంకార ప్రభుత్వం పోయి ఆత్మగౌరవ ప్రభుత్వం రావాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన కార్మికచైతన్య బస్సుయాత్ర శుక్రవారం తాళ్లరేవుకు చేరుకుంది. టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ బాలయోగి టీఎన్‌టీయూసీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వాహనమిత్ర అంటూ పథకాలను మార్చి వాహనాలకు టాక్సీలు, జరిమానాలను పెంచేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల పొట్ట గొట్టి ఇసుకను బొక్కేస్తుందని, ఇటువంటి అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. టీఎన్‌టీయూసీ నాట్యమండలి బృందం ప్రజావ్యతిరేక విధానాలపై పాటలు పాడి చైతన్యపరిచారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు, టీడీపీ నాయకులు ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, రోళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.

తూరంగిలో బస్సుయాత్రకు స్వాగతం

కాకినాడ రూరల్, జనవరి 12: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో తూరంగి విచ్చేసిన కార్మిక చైతన్య బస్సుయాత్రకు కార్యకర్తల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో తూరంగి, ఉప్పలంక గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లకు యూనిఫారమ్ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పంపిణీ చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జోన్-1 ఇన్‌చార్జి కోగంటి లెనిన్, జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబా, ఎం.శ్రీను, ప్రసాద్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి'

అన్నవరం, జనవరి 12: రాష్ట్రంలో పేదల బ్రతుకులు మారాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకుడు చింతల అశోక్‌కుమార్ అన్నారు. జగన్ రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల నిధులు దారి మళ్లించి దారిద్ర్య రేఖ దిగువకు చేర్చారన్నారు. చంద్రబాబు సీఎం కావాలని ఇచ్ఛాపురం నుంచి తిరుపతికి పాదయాత్రగా బయల్దేరిన ఆయనకు అన్నవరంలో టీడీపీ కార్యకర్తలు సరమర్ల మదుబాబు, బండారు సురేష్, రాయి శ్రీను స్వాగతం పలికారు.

'లబ్ధిదారులకు న్యాయం చేయాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 12: కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 2022లో అచ్యుతాపురం, పటవల, కొమరిగిరి లేఔట్‌లు వేసి 16వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని.. కానీ 400 ఇళ్లు కూడా పూర్తి కాని దుస్థితి ఏర్పడిందని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ అన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు న్యాయం చేయాలని హౌసింగ్ అధికారులకు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు.

ఉప్పరగూడెంలో ఆధ్యాత్మిక సదస్సు

నాగులాపల్లి (కొత్తపల్లి), జనవరి 12: క్షణికావేశాన్ని నియంత్రణ చేసేదే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానమని విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. శుక్రవారం నాగులాపల్లి శివారు ఉప్పరగూడెం ఆశ్రమంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సులో ఆయన ప్రసంగించారు. సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి, తాత్విక బాలవికాస్ బాలికలు మాస్టర్ నంధ్యాల యశ్వంత్, సన్నిబోయిన కిరణ్, గంగా లలిత, ఉమాగౌరీ, పెద్దఅప్పన్న మాట్లాడారు. సర్పంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉమర్‌ఆలీషాను ఘనంగా సత్కరించారు.

యనమల, రాజప్పను కలిసిన సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 12: తెలుగుదేశం మాజీ మంత్రులు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్పను శుక్రవారం ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా కలిశారు. కాకినాడలోని యనమల స్వగృహం వద్ద వారి ఇద్దరిని సత్యప్రభ మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై చర్చించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తొండంగి, జనవరి 12: విద్యుత్ షాక్ కారణంగా గత ఆరేళ్లుగా ఇంటికే పరిమితమైన తొండంగి గ్రామానికి చెందిన దాకి లోవరాజు కుటుంబానికి శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణి సేవాసమితి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందించారు. సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

జగ్గంపేట, జనవరి 12: రంగవల్లినగర్‌లో అగ్నిప్రమాద బాధితులను రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. జార్జిబాబు, సురేంద్ర, శ్రీనివాస్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తుని రూరల్, జనవరి 12: తుని పోస్టాఫీసు వీధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి కలకలం రేపింది. విజయస్కానింగ్ సెంటర్ సమీపంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలియకపోవడంతో సంబంధికులు పట్టణ సీఐ 9440796573కి సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి, జనవరి 12: ఏ.కొత్తపల్లికి చెందిన పసుపులేటి రవికుమార్ (32) అప్పుల బాధ తాళలేక ఈనెల 8న పురుగుల మందు తాగాడు. కాకినాడకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. అతడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.